www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 01 | జనవరి | 2026
పేజీలు : 8

## విందులు చిందులు కాదు.. లక్ష్యం ముఖ్యం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** జన జీవితాలలో రెండు దశాబ్దాలుగా క్రమేపి మార్పు కనిపిస్తుంది. ముఖ్యంగా యువత పాశ్చాత్య సంస్కృతి వైపు పరుగులు పెడుతుంది. భారతీయ సమాజం ఒకప్పుడు బా ధ్యత కలిగిన యువతను దేశానికి అందించింది. బాధ్యతతో మెలిగిన యువత సమాజం పట్ల, కుటుంబం పట్ల కూడా బాధ్యతతో వ్యవహరిస్తుండడంతో ఒక మంచి సమాజం రూపు దిద్దుకునేది. కానీ ఇప్పటి యువత

మిగతా 2లో..

# శతాబ్ది ఉత్సవ సభకు విస్తృత ప్రచారం

### -జిల్లా వ్యాప్తంగా భారీ హోర్డింగ్‌లు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న జరగనున్న భారీ బహిరంగ సభకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామ గ్రామాన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో పాటు అమరుల పేరుతో ప్రత్యేక హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే మొదటి దశ గోడ రాత(వాల్ రైటింగ్స్)లను పూర్తి చేశారు. ఖమ్మం నగరానికి నలు మూలల నుంచి జనవరి 18న ప్రదర్శనలు వస్తుండ డంతో నలువైపులా ప్రధాన రహదారులకు

మిగతా 2లో..

# పార్టీ విస్తృతిలో 'చావా' పాత్ర చిరస్మరణీయం

### -సుగుణమ్మ సంస్మరణ సభలో కూనంనేని



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** కమ్యూనిస్టు పార్టీ విస్తృతిలో సుగుణమ్మ పాత్ర చిరస్మరణీయమని చావా వెంకటేశ్వరరావు కుటుంబం పార్టీకి అంకితమై పని చేసిన కుటుంబమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ చీలిక అనంతరం సిపిఐ నిర్మాణంలో చావా వెంకటేశ్వరరావు ఎనలేని కృషి చేశారని చావా వెంకటేశ్వరరావుకు ఆయన సతీమణి సుగుణమ్మ అన్ని విధాలా సేవలు అందించారని ఆయన తెలిపారు. చావా సుగుణమ్మ సంస్మరణ సభ బుధవారం కొక్కిరేణి గ్రామంలో జరిగింది. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ తిరుమలాయపాలెం సమితిగా ఉన్నప్పుడు చావా వెంకటేశ్వరరావు సమితి అధ్యక్షున్ని గెలిపించడంతో పాటు పాలేరు నియోజక వర్గం నుంచి సిపిఐ అభ్యర్థి గా పోటీ చేసిన భూపతిరావును కూడా గెలిపించి సిపిఐ బలమెంతో చూపించారన్నారు.

మిగతా 2లో..

# విర్రవిగితే విజ్ఞత నేర్పుతాం





### -పల్లెల ప్రగతికి కృషి చేయండి
### -పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు
### -సర్పంచ్‌ల సన్మాన సభలో మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/ఖమ్మం :** అధికారం కోల్పోయినా విర్రవిగితే విజ్ఞత నేర్పక తప్పదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. అహంకారం తగ్గని కొందరు నాయకులకు కాలమే సమాధానం చెబుతుందని ఆయన అన్నారు. 2025 సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు అనేక తీపి జ్ఞాపకాలను మిగిల్చిందని ఆయన తెలిపారు. బుధవారం ఖమ్మంలోని ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో పాలేరు నియోజక వర్గంలో గెలిచిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు

మిగతా 2లో..

# సాయుధ సమరసేనాని కర్నాటి కృష్ణయ్య

### -సిపిఐ శతాబ్ది సమర సంబురం

**ప్రజాపక్షం/ నేలకొండపల్లి :** ప్రపంచ చరిత్రలో సువర్ణక్షరాలతో లిఖించదగిన మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఖమ్మం జిల్లాకు చెందిన ఎందరో యోధులు కీలక భూమిక పోషించారు. తమ ప్రాణాలను ఫణంగా పెట్టి నిజాం రక్కసి పాలనకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడారు. అటువంటి వారిలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలానికి చెందిన కృష్ణయ్య ముందు వరుసలో ఉంటారు. రైతు కుటుంబంలో జన్మించిన కర్నాటి కృష్ణయ్య తుదికంఠ విప్లవోద్యమ బాటలోనే పనిచేశారు. ఖమ్మం తొలి శాసన సభ్యులుగా, సిపిఐ నాయకునిగా, రైతు సంఘం రాష్ట్ర బాధ్యులుగా, గ్రామ సర్పంచ్‌గా బహుముఖ బాధ్యతలను నిర్వర్తించారు. యుక్త వయస్సులోనే సమాజంపై అవగాహన కలిగిన కృష్ణయ్య అప్పట్లో కామేశ్వరరావు అనే తన తండ్రి స్నేహితుని వద్ద కఱ్ఱ సాము, కత్తి సాము, కుస్తీ, ఇతర శారీరక వ్యాయామాలను నేర్చుకున్నాడు. నేలకొండపల్లి ప్రాంతంలో ఆంధ్ర మహాసభ బాధ్యులుగా ఉన్న పెండ్యాల సత్యనారాయణతో కలిసి కర్నాటి కృష్ణయ్య ఆంధ్ర మహాసభ ప్రచారాలను విస్తృతంగా చేపట్టారు. రావెళ్ల జానకి రామయ్య, కెఎల్ నర్సింహారావు, మచ్చా వీరయ్య, వీర మాచినేని ప్రసాద్ తదితరులతో స్నేహం ఏర్పడిన తర్వాత కృష్ణయ్య కమ్యూనిస్టుగా మారారు. పలుసార్లు పోలీస్ నిర్బంధాలను ఎదుర్కొన్నారు. ఈత, తాటిచెట్లను నరికిన ఘటనకు సంబంధించి పోలీసులు కర్నాటి కృష్ణయ్యను పలుమార్లు వేధించారు. అప్పట్లోనే పుచ్చలపల్లి సుందరయ్య, దేవులపల్లి వెంకటేశ్వరరావు లాంటి నాయకులతో



కృష్ణయ్యకు పరిచయం ఏర్పడింది. కర్నాటి కృష్ణయ్య 1947లో నేలకొండపల్లి ప్రాంతంలో దళాల ఏర్పాటులో కీలక భూమిక పోషించారు. రజాకార్లు గ్రామాలపై పడి ప్రజలపై తీవ్ర దమనకాండ కొనసాగిస్తున్న సమయంలో వాటిని ఎదుర్కొనేందుకు దళాల నిర్మాణమే పరిష్కారమని నేలకొండపల్లి ప్రాంతానికి చెందిన 40 మంది ముఖ్యులకు కృష్ణాజిల్లా

మిగతా 2లో..

# పార్టీ విస్తృతిలో 'చావా' పాత్ర చిరస్మరణీయం



(మొదటిపేజీ తరువాయి)
పార్టీ విభజన తర్వాత అనేక మందిని పార్టీలోకి ఆహ్వానించడంతో పాటు అనేక మందిని నాయకులుగా తీర్చిదిద్దడంలో చావా పాత్ర ప్రముఖమైందన్నారు. చావా రాజకీయాల్లో నిమగ్నమైనప్పుడు ఆయన సతీమణి సుగుణమ్మ అన్ని విధాలా ఆయనకు తోడ్పాటు నందించిందని కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు ఎందరికో ఆమె నిత్యం భోజనాలు పెడుతూ ఎంతో అప్యాయంగా చూసుకునేదని కూనంనేని తెలిపారు. మారుతున్న పరిస్థితుల్లో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని ఒక పక్క ధన రాజకీయాలు, మరో పక్క మత రాజకీయాలు పెరిగి వ్యవస్థను కలుషితం చేస్తున్నాయన్నారు. పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్న నేపథ్యంలో ప్రజల కోసం పని చేసేందుకు కమ్యూనిస్టులు అవసరమని ఆయన తెలిపారు. రానున్న కాలంలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కృషి చేయడమే అందరి లక్ష్యం కావాలన్నారు. ఈ సభలో ఐఎఫ్‌టియు జాతీయ నాయకులు పోటు ప్రసాద్ (పుల్లయ్య), సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, కొండపర్తి గోవిందరావు, బిజి క్లెమెంట్, శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహలక్ష్మి, రిటైర్డ్ పోలీస్ అధికారి సుభాష్ చంద్రబోస్, చావా తనయుడు చావా వేణు, సిపిఐ నాయకులు రాధాకృష్ణ, బాలరాజు, సిపిఎం నాయకులు కొమ్ము శ్రీను తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు చావా వెంకటేశ్వరరావు, సుగుణమ్మ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# సాయుధ సమరసేనాని కర్నాటి కృష్ణయ్య

(మొదటిపేజీ తరువాయి) గన్నవరం వద్ద మిలటరీ శిక్షణ ఇవ్వగా కర్నాటి కృష్ణయ్య అక్కడ శిక్షణ పొందారు. సుర్దేపల్లిలో 1947 ప్రాంతంలో జరిగిన ఓ ఘటన అప్పట్లో చర్చనీయాంశమైంది. తొలిసారి సుర్దేపల్లిలో సాయుధ దళాలు ప్రజా కోర్టును నిర్వహించి గ్రామ సమస్యలను పరిష్కరించే వారు. సుర్దేపల్లిలో జరిగిన ప్రజా కోర్టు తర్వాత పటేల్, పట్వారీలు గ్రామాలను వదిలి ఆం ధ్రా ప్రాంతాలకు పారిపోవడం మొదలైంది. కృష్ణయ్య తిరుగుబాటు ల క్షణాలు ప్రజలను ఉత్తేజపర్చడాన్ని గమనించిన అప్పటి నైజాం ప్రభు త్వం కర్నాటి కృష్ణయ్యను పట్టిస్తే రూ.10వేలు బహుమతిని ప్రకటించి గోల్కొండ పత్రికలో అచ్చు వేసింది. యూనియన్ సైన్యాల రాకతో నిర్బంధం పెరగడంతో కృష్ణయ్య తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. కర్నాటి కృష్ణయ్య స్వగ్రామం కొత్తూరుపై దాడి చేసి వారి తండ్రి కోట య్య సహా పలువురిని నిర్బంధించి కృష్ణయ్య జాడ కోసం తీవ్రంగా హిం సించారు. ఆ సమయంలో కృష్ణయ్య బందర్‌లో రక్షణ పొందారు. బందర్‌లో అరెస్టయిన తర్వాత బందర్, రాజమండ్రి జైళ్లలో కృష్ణయ్యను నిర్బంధించారు. ఆ తర్వాత కడలూరు జైలుకు కృష్ణయ్యను తరలించగా అక్కడ పెద్ద ఎత్తున ఆందోళనను నిర్వహించారు. 28 రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టిన వారిలో కృష్ణయ్య ఒకరు. జాల్నా, వరంగల్, చంచల్‌గూడ సెంట్రల్ జైళ్లలో సైతం పలుమార్లు కృష్ణయ్యను నిర్బంధించారు. నిజాం సంస్థాన శకం ముగిసన తర్వాత కమ్యూనిస్టు పార్టీపై నిర్బంధం ఉండడంతో 1952లో ఖమ్మం నియోజక వర్గం నుంచి క మ్యూనిస్టుల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. కృష్ణయ్యతో పోటీ పడ్డ మిగిలిన ఆరుగురికి డిపాజిట్లు దక్కకపోవడం గమనార్హం. నండికొండ ప్రాజెక్టు కోసం జరిగిన ఆందోళనలోనూ కృష్ణయ్య కీలక భూమిక పోషించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1964 డిసెంబర్‌లో కర్నాటి కృష్ణయ్యను మరోమారు అరెస్టు చేశారు. 1964లో అరెస్టయిన కృష్ణయ్యను 18 మాసాల పాటు వివిధ జైళ్లలో బంధించారు. ఆ తర్వాత నేలకొండపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా రాజేశ్వరపురం షుగర్ ఫ్యాక్టరీ వైస్ ఛైర్మన్‌గా, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘంలో వివిధ హోదాలలో రెండు దశాబ్దాల పాటు పనిచేశారు. సిపిఐ జిల్లా నాయకునిగా పలు ప్రజా ఆందోళనలకు, పోరాటాలకు నాయకత్వం వహించారు. కర్నాటి కృష్ణయ్య నిస్వార్థ కమ్యూనిస్టుగా, పోరాట యోధునిగా కీర్తిగడించారు. ఆయన కుటుంబం ఆయన ఆశయసాధనలోనే ముందుకు సాగుతుండటం అభినందనీయం. ఆయన తనయుడు కర్నాటి భానుప్రసాద్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యునిగా, పాలేరు నియోజక వర్గ నాయకునిగా వివిధ ప్రజా ఉద్యమాలకు, ఆందోళనలకు కమ్యూనిస్టు పార్టీ పక్షాన నాయకత్వం వహిస్తున్నారు. కృష్ణయ్య మరణించి 27 సంవత్సరాలు గడిచిన ఆయన చేపట్టినఉద్యమాలు నిత్య స్మరణీయంగా ప్రజలమదిలో మెదులుతున్నాయి.

# విర్రవిగితే విజ్ఞత నేర్పుతాం

(మొదటిపేజీ తరువాయి)
సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ పాలేరు నియోజక వర్గంలో ప్రజలు ఎంతో చైతన్యవంతంగా ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. వచ్చిన ఫలితాలతో పొంగిపోకుండా గెలిచిన సర్పంచ్‌లు పల్లెలను ప్రగతి పథాన నడపాలని ఆయన సూచించారు. గెలిచిన వారు ఓడిన వారు కూడా నా దృష్టిలో సర్పంచులేనని ప్రతి ఒక్కరిని కంటి రెప్పలా కాపాడుకుంటామని ఆయన తెలిపారు. నియోజక వర్గంలోని 134 పంచాయతీలలో సుమారు 70 శాతం కాంగ్రెస్ మద్దతుదారులు గెలవడం శుభపరిణామమన్నారు. చిన్నపాటి విబేధాల కారణంగా స్వల్ప తేడాతో కొన్ని పంచాయతీలు ఓడిపోయామని గతంలో ఏలిన వారు గెలిచిన స్థానాల సంఖ్య కనిష్ట స్థాయికి పడిపోవడంతో ప్రజలు ఎవరి పక్కన ఉన్నారో స్పష్టమైందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే రకమైన ఫలితాలు వస్తాయని పొంగులేటి ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర సాయం లేకున్నా 22,500 కోట్లతో ఇందిరమ్మ గృహ నిర్మాణం చేపట్టామని ప్రతి నియోజక వర్గంలోనూ 3,500 ఇండ్లు నిర్మిస్తామన్నారు. ఈ సభలో ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ, వివిధ కార్పోరేషన్ల ఛైర్మెన్లు, వైస్ ఛైర్మెన్లు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యాసంగిలోనూ తప్పని యూరియా తిప్పలు




ప్రజాపక్షం/చింతకాని : వానాకాలం సీజన్‌లో యూరియా కోసం ఇబ్బంది పడిన రైతులకు యాసంగిలోనూ కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం మొక్కజొన్న , వరి సాగు చేస్తుండగా అవసరమైన యూరియా కోసం గంటల కొద్దీ క్యూలో నిల్చోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చింతకాని, నాగులవంచ సహకార సంఘాల వద్ద బుధవారం ఉదయం నుంచే రైతులు బారులు తీరారు. ఎన్ని ఎకరాల్లో సాగు చేసినా ఒక్కొక్కరికి ఒక బస్తా మాత్రమే ఇస్తున్నారని , వాటి కోసం ఎంతో సేపు వేచి చూడాల్సి వస్తోందని అంటున్నారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పాస్తుకం జిరాక్స్‌తో రెండు, మూడు రోజులుగా పీఏసిఎస్‌ల చుట్టూ తిరుగుతున్నామని రైతులు వాపోతున్నారు. సరిపడా ఇచ్చేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కాగా పీఏసిఎస్ కార్యాలయాల్లో సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందవద్దని ఏఓ మానస ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రజాపక్షం కార్యాలయంలో

# నూతన సంవత్సర వేడుకలు



ప్రజాపక్షం/ ఖమ్మం : ప్రజాపక్షం కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. 2026 సవంత్సరానికి స్వాగతం పలుకుతూ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎడిషన్ ఇంచార్జి ఏనుగు వెంకటేశ్వరరావు, స్టాఫ్ రిపోర్టర్ కొర్లపాటి ప్రసాదరావు, సబ్ ఎడిటర్ పి. రాంబాబు, రిపోర్టర్లు వెంకట్, పవన్, ఆపరేటర్ రాము, పిఎస్ఆర్ ట్రస్టు ఛైర్మన్ పరిశ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# శతాబ్ది ఉత్సవ సభకు విస్తృత ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)
స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రధాన రహదారుల వెంట భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. బైపాస్ రోడ్డు, వైరా రోడ్డు, ఇల్లందు క్రాస్ రోడ్డు, బోనకల్ క్రాస్ రోడ్డు లలో ఫ్లెక్సీల ఏర్పాటు జరుగుతున్నాయి. జనవరి 18న జరిగే బహిరంగ సభ సందర్భంగా కాల్వొడ్డు నుంచి జనసేవాదళ్ కవాత్, ప్రజా సంఘాల ప్రదర్శన బోనకల్ రోడ్డు నుంచి కళాకారుల ప్రదర్శన సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్ నుంచి ప్రజా ప్రదర్శన నలువైపుల నుంచి రానుంది. బహిరంగ సభ అనంతరం రెండు రోజుల పాటు జాతీయ కౌన్సిల్ కూడా జరగనుండడంతో ఆ దిశగా కూడా ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. 19, 20 తేదీలలో జాతీయ కౌన్సిల్ సమావేశం ఖమ్మంలో జరగనుంది. ఈ సమావేశానికి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజాతో పాటు సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, వామపక్షాలకు చెందిన దీపాంకర్ భట్టాచార్య సహా పలువురు జాతీయ నేతలు హాజరవుతున్న నేపథ్యంలో ప్రచారానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు.

### మూడు నుంచి ప్రచార జాతా..

శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను పురస్కరించుకుని మూడు నుంచి ఏడు వరకు ప్రచార జాతాను నిర్వహించనున్నారు. మూడవ తేదీ ఉదయం 10 గంటలకు సత్తుపల్లిలో జాతా ప్రారంభమవుతుంది. జాతాను సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ప్రారంభించనుండగా ప్రారంభ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్ పాల్గొననుండగా జాతాకు జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు, సిహెచ్ సీతామహాలక్ష్మి నేతృత్వం వహించనున్నారు. సత్తుపల్లిలో ప్రారంభమై వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, కొణిజర్ల, వైరా మండలాల మీదుగా ఖమ్మంకు చేరుకోనుంది. ఈ జాతా మూడవ తేదీ నుంచి ఏడవ తేదీ వరకు జిల్లాలో విస్తృతంగా ప్రచారం నిర్వహించనుంది.

# విందులు చిందులు కాదు.. లక్ష్యం ముఖ్యం



(మొదటిపేజీ తరువాయి)
ఆలోచనల్లో మార్పు వచ్చింది. మనది మాది అనే ఆలోచన స్థానే నాది అన్న భావన యువతలో దినదినా ప్రవర్థమానమైంది. స్వార్థ చింతన ఉన్న వారిలో మాది అన్న భావనైనా గతంలో ఉండేది. మా బంధువులు, మా కుటుంబం అన్న ఆలోచనతో పని చేశారు. అప్పుడు అదే ప్రమాదమానుకుంటే ఇప్పుడు కుటుంబాన్ని కూడా పక్కనపెట్టి నాదెంటి అన్న సంకుచిత భావన పెరిగింది. దానితో పాటే జీవితమంటే సరదాగా గడిపేయడమన్న భావన బలపడింది. పండుగలు, పబ్బాలు జన్మదినాల పేరుతో జల్సాగా గడిపేస్తున్నారు. ఇక కొత్త సంవత్సరం అంటే చెప్పాల్సిన అవసరమే లేదు. విందులు, చిందులు మందుతో గడిపేస్తున్నారు. విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. కొత్త సంవత్సరం వస్తుందన్న ఆనందం కంటే ఒక సంవత్సరం జీవితంలో గడిచిపోయిందన్న ఆలోచన కూడా ముఖ్యమైంది. జీవితంలో ఒక లక్ష్యం లేని ప్రయాణం దారం తెగిన గాలిపటం లాంటిది. లక్ష్యం లేకపోతే ఏ వైపుకు పయనించాలో తెలియక జీవితమే వ్యర్థమవుతుంది. నూతన సంవత్సరంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష్యం దిశగా పయనించాలని కోరుకుందాం. ఇక విందులు, చిందుల పేరుతో అతిగా మద్యం సేవించడం ప్రమాదాలకు గురికావడం జరుగుతుంది. ఇది కుటుంబాల్లో తీరని కలతను సృష్టిస్తుంది. ఎంజాయ్ పేరిట జీవితాలను నాశనం చేసుకునే కంటే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగేందుకు కృషి జరగాలి.

# వన సంరక్షణ సమితితో అటవీ సంరక్షణ



**వన సంరక్షణ సమితి సమావేశ మందిరాన్ని ప్రారంభించిన మంత్రి పొంగులేటి**

**ప్రజాపక్షం/కల్లూరు:** వన సంరక్షణ సమితితో అటవీ సంరక్షణ, అభివృద్ధికి అటవీ శాఖ కు చక్కటి సహకారం లభిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో నిర్మించిన వన సంరక్షణ సమితి సమావేశ మందిరాన్ని మంత్రి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రివ మాట్లాడుతూ వన సంరక్షణ సమితిని ప్రోత్సహిస్తే, అడవికి మంచి జరుగుతుందని అన్నారు. కనకగిరి, పులిగుండాల తదితర అటవీ ప్రాంతాల్లో 4 నుండి 5 వన సంరక్షణ సమితులు క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు ఆయన అన్నారు. ఇందులో నుండి గుర్తించిన ఒక సమితిని పైలట్ ప్రాజెక్ట్ గా తీసుకొని వారిని ఆర్థికంగా ప్రోత్సహించడానికి రూ. 20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. విదేశాలకు విహారాలకు కోట్లు పెట్టి వెళతారని, మన చుట్టూ విహారానికి అద్భుతమైన ప్రదేశాలు ఉన్నాయని అన్నారు. జిల్లాలో పులిగుండాల, కనకగిరి హిల్స్ సుమారు 35 వేల ఎకరాలకు ఒకే బిట్ గా అటవీ ప్రాంతం విస్తరించివుందని తెలిపారు. ఈ ప్రాంతం ఎంతో బాగుందని, విదేశాల్లో ఉన్న పర్యాటక ప్రాంతాల రేంజ్ లో వీటిని తీర్చిదిద్దే అవకాశం ఉందని అన్నారు. అడవులను రక్షించుకుంటూ, వన్యప్రాణులను కాపాడుకుంటూ, వినోదానికి, గిరిజనులకు ఉపయోగ పడి, లబ్ది కలిగే విధంగా ప్రోత్సహిస్తూ ప్రణాళిక చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి కార్యాచరణకు కావాల్సిన నిధులు మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అటవీ పరిరక్షణ చాలా అవసరమని, అటవీ పరిరక్షణలో పౌరులుగా మన అందరిపై బాధ్యత ఉందని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, 13 లక్షల వ్యయంతో వన సంరక్షణ సమితి సమావేశ మందిరాన్ని నిర్మించి, ప్రారంభించుకున్నామన్నారు. 35 వేల ఎకరాల అటవీ ప్రాంతాన్ని కబ్జా, ఆక్రమణ నుండి కాపాడడంలో వన సంరక్షణ సమితి పాత్ర కీలకంగా ఉందన్నారు. వన సంరక్షణ సమితి ఆర్థికాభివృద్ధి కి జిల్లా యంత్రాంగం నుండి అన్ని విధాలా సహకారం ఇస్తామన్నారు. కనకగిరి, పులిగుండాల, నీలగిరి పార్క్ లలో వారాంతం గడిపేలా అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు.సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, అడవులు, చెట్లు లేకపోతే మానవ మనుగడ లేదన్నారు. పర్యావరణ పరిరక్షణకు అడవులు ఎంతో అవసరమన్నారు. చెట్ల పెంపకం, వన సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పులిగుండాల, కనకగిరి హిల్స్ ప్రాంతాలను ప్రోత్సహించి అభివృద్ధి చేస్తే, చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలకు ఆదాయంతో పాటు ఉపాధి లభిస్తుందని తెలిపారు. అంతకుముందు మంత్రి పులిగుండాల ఎకో టూరిజం విహారానికి రెండు వాహనాలను ప్రారంభించారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారిచే ఉచితంగా పంపిణీ జ్యూస్, సబ్బులు, విస్తరాకులు తయారీ యూనిట్లను వన సంరక్షణ సమితిలకు అందజేశారు. వన సంరక్షణ సమితి సభ్యులను మంత్రి సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, ఎఫ్ డిఓ మంజుల, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నీరజ ప్రభాకర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆందోళన చెందవద్దు

**-ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రఘునాథపాలెం మండలంలో యూరియా సరిపడినంత నిల్వలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందవద్దని ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని రఘునాథపాలెం సొసైటీని ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు సందర్శించారు. సొసైటీలో యూరియా నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత లేదని తెలిపారు. గడిచిన ఐదు రోజుల్లో 200 టన్నుల యూరియాను సొసైటీల ద్వారా రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం మండలంలోని అన్ని సొసైటీలలో 150 టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. కలెక్టర్ ఆదేశానుసారం సొసైటీల వద్ద ఉదయం ఆరు గంటల నుంచి యూరియా అమ్మకాలు చేపట్టాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకు వచ్చిన రైతులకు టోకెన్ పద్ధతి ద్వారా యూరియా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల



వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, సొసైటీ కార్యదర్శి మద్దినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేటి తరం కమ్యూనిస్టులకు తలారి ఆదర్శం

**ప్రజాపక్షం/ మధిర :** పేద ప్రజల కష్టాలు గుర్తించి వారికి సేవలందించడం ద్వారా అమరజీవి తలారి వెంకటేశ్వరరావు జననేతగా ఖ్యాతి పొందారని, ఆయన అందించిన నిస్వార్థ సేవల ఫలితంగానే మహబూబాద్ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ బలమైన పునాదులు ఏర్పడ్డాయని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మందడపు రాణి, తోట రామాంజనేయులు అన్నారు. బుధవారం మహబూబాద్ సిపిఐ మాజీ సహాయ కార్యదర్శి అమరజీవి తలారి వెంకటేశ్వరరావు 13వ వర్ధంతి వేడుకలను దెందుకూరు గ్రామంలో ఆయన స్మారక స్థూపం వద్ద ఘనంగా జరిగాయి. ముందుగా వెంకటేశ్వరరావు స్మారక స్థూపానికి నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ సిపిఐ వందేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ చాలా మంది యోధుల్ని కోల్పోవడం దురదృష్టకరమని, అందులో తలారి వెంకటేశ్వరరావు ఒకరని అన్నారు. తలారి వెంకటేశ్వరరావు మధిర మండలం దెందుకూరు గ్రామంలో జన్మించి మొదటి నుండి ఆయన తుది శ్వాస వరకు కమ్యూనిస్టుగానే జీవించారని, ఈ ప్రాంత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం వెంకటేశ్వరరావు చేసిన కృషి మరువలేనిదన్నారు. తల్లారి మహబూబాద్‌లో పనిచేస్తూ ఆరోజుల్లో ఆయనతో కలిసి యోధులు అనేక రాష్ట్రస్థాయి ఉద్యమ, భూ



పోరాటాల్లో పాల్గొన్నారని తెలిపారు. ఆయన సేవలను గుర్తుగా మహబూబాద్‌లో తలారి వెంకటేశ్వరరావు నగర్‌గా ఆయన పేరు పెట్టడం అభినందనీయమన్నారు. ఆయన్ని ఆదర్శంగా తీసుకుని కమ్యూనిస్టులంతా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, పరుచూరి రాము, మచ్చ వెంకటేశ్వరరావు, నాయకులు రామ నర్సయ్య, జల్లా బ్రహ్మం, అప్పారావు, తలారి రమేష్, దయామని, ఏడుకొండలు, కరుణమ్మ, ఉద్దండు, నాగేంద్రమ్మ, కోటమ్మ, సుధా, నంద్రు పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్‌కిడ్జ్‌లో నూతన సంవత్సర వేడుకలు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. 2026 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బుధవారం నిర్వహించిన వేడుకలు అంబరాన్ని అంటాయి. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ చిన్నారులు నృత్యాలు చేస్తూ ఆట పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య నూతన సంవత్సర సందర్భంగా కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. పాఠశాలకు సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నూతన సంవత్సరం అందరికీ శుభాలు అందించాలని కృష్ణచైతన్య తెలిపారు. చదువుతో పాటు అన్ని రంగాలలో విద్యార్థులు ఘన విజయాలను సాధించి పాఠశాలకు జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రెజొనెన్స్‌లో న్యూ ఇయర్ వేడుకలు




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని శ్రీ నగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. 2026 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బుధవారం పాఠశాలలో నిర్వహించిన వేడుకలు అంబరాన్ని అంటాయి. చిన్నారులు ఆట పాటలు, కేరింతలతో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి లు నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో కొత్త కొత్త విషయాలు తెలుసుకుని మంచి అలవాట్లు అలవర్చుకోవాలని విద్యార్థులకు వివరించారు. గత సంవత్సర అనుభవాల స్ఫూర్తితో ఈ ఏడాది ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని అత్యున్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



**ప్రజాపక్షం/చింతకాని :** నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు బధవారం ఘనంగా నిర్వహించారు.2025 సం వత్సరానికి వీడ్కోలు చెబుతూ 2026కు స్వాగ తం పలికారు. ఈ సందర్భంగా పాఠశాలలో అందమైన ముగ్గులు వేసి రంగులతో అలంకరించారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బోడేపుడి కిరణ్ , ప్రిన్సిపాల్ చావా అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు పార్వతి, త్రివేణి, నాగదుర్గ, చందన, ఝాన్సీ, సుజిత, ఆదిలక్ష్మి , సుజాత, శోభ , విధ్యార్థులు పాల్గొన్నారు.

# పిహెచ్‌సిని తనిఖీ చేసిన ఎన్‌సిడి అధికారిణి



**ప్రజాపక్షం/ముదిగొండః** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఎన్‌సిడి అధికారిణి డాక్టర్ అంకం అరుణాదేవి బుధవారం ఆకస్మీక తనిఖీ చేశారు. ఫార్మసీలో మందుల నిల్వలు, ల్యాబ్ రికార్డులను ఆమె తనిఖీ చేశారు. బాలికల్లో సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్‌పివి వ్యాక్సినేషన్‌ను వేగవంతం చేయాలని ఆదేశించారు. గర్భిణులకు మెరుగైన వైద్యం అందిస్తూ, సాధరణ ప్రసవాలు జరిగేలా చూడాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి, సూపర్‌వైజర్లు, సిహెచ్‌ఓ, ఫార్మసిస్టులు, స్టాఫ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారుల నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని చిరు వ్యాపారుల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ మిరియాల రమణ గుప్తా ఆధ్వర్యంలో జరిగిన చిరు వ్యాపారుల సమావేశంలో ఈనూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతనన కమిటీ సభ్యులుగా పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు, కెశంకరమ్మ, ఆదిమూలం పుల్లారావు, చిన్నంస్వామి, పెగళ్ళపాటి శ్రీనివాసరావు, షేక్.రబ్బానిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడతూ వీధి వ్యాపారుల శాశ్వత పరిష్కారం కోసం మిరియాల రమణగుప్తా ఆధ్వర్యంలో ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. గత 30 సంవత్సరాల నుండి మధిర పట్టణంలో రోడ్ల వెంట బడ్డీ కొట్లు పెట్టుకుని జీవనం సాగిస్తుండగా మున్సిపాల్టీ అధికారులు తొలగించడంతో జీవనం కోల్పోయామని వారు తెలిపారు. మాకు శాశ్వతంగా ఒక పరిష్కార మార్గం చూపించాలని ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కోరారు. కార్యక్రమంలో వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

## నర్సరీ పనులు ప్రారంభించాలి : ఎంపిడిఓ



ప్రజాపక్షం/పాల్వంచ : నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన సర్పంచ్‌ల ద్వారా నర్సరీ పనులను ప్రారంభించాలని ఎంపిడిఓ కుదుముల విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో గ్రామపంచాయితీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలకు నీరు సరఫరా చేయాలన్నారు. వాచ్ అండ్ వార్డు పేమెంట్‌లను చెల్లించాలని సూచించారు. ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరు అయిన ఇందిరమ్మ గృహాల లబ్దిదారులకు 90 రోజుల మస్టర్ పేమెంట్ చేయాలన్నారు. నర్సరీ పనులను వెంటనే ప్రారంభించిబ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ చెన్నకేశవులు, ఏపిఓ పోరండ్ల రంగా, ఈసి. పుల్లయ్య, పంచాయితీ కార్యదర్శులు, క్షేత్ర, సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు మేతగా మారుతున్న ప్లాస్టిక్ వస్తువులు



ప్రజాపక్షం/పాల్వంచ : బాధ్యతారహితంగా ఎక్కడ పడితే అక్కడ పడేసిన చెత్త, ప్లాస్టిక్ వస్తువులు పశువులకు మేతగా మారుతున్నది. యాజమానులు వాటి ఆ లనా పాలనా పట్టించుకోకుండా రాత్రి స మయంలో వదిలేస్తున్నారు. రహదారుల పక్కనే పడేసిన ప్లాస్టిక్‌తో కడుపునింపుకొంటున్నాయి. తద్వారా అనారోగ్యం భారిన పడుతూ బక్కచిక్కి ప్రాణాల మీదికి తెచ్చుకొంటున్నాయి. గొల్లగూడెం కొమ్ముగూడెం రహదారి పక్కన వేసిన చెత్తను పశువు తన ఆహారంగా తీసుకొంటున్నది. విచ్చల విడిగా డ్రైనేజీలల్లో, రహదారుల పక్కన వేసిన చెత్త వలన దుర్గంధం వెజల్లుతున్నది. దోమలకు ఆవాసాలుగా మారుతున్నది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీనితో ప్రజలు పలు రోగాల భారిన పడుతూ ఆసుపత్రులకు క్యూగట్టాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇది మనది, మన ఇల్లు, మనవీధి, మన పరిసరాలు, పరిశుభ్రతపై ధ్యాస లేకుండా పడేస్తున్న చెత్తతో పశువులే కాకుండా ప్రజలు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత సంవత్సరంలో పాల్వంచ వ్యాపార వర్గాలు, అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థలు చెయిా చేయి కలిపారు. ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై దాదాపుగా యుద్దమే ప్రకటించారు. ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహ సదస్సులు నిర్వహించారు. దీనితో పట్టణం, మండల వ్యాప్తంగా ప్రజలు కొన్ని నెలల పాటుగా ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించారు. క్రమంగా పట్టు సడలంతో ప్లాస్టిక్ క్రయ విక్రయాలు జోరందుకొన్నాయి.

## టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు బహుమతులు



ప్రజాపక్షం/మణుగూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాల మణుగూరు నందు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన మెగా టాలెంట్ టెస్ట్ లో విజేతలైన వారికి బుధవారం కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో బహుమతులు అందించడం జరిగింది. మొదటి, రెండవ మూడవ బహుమతులను మణుగూరు కు చెందిన లయన్ పిల్లారి శెట్టి హరిబాబు స్పార్సర్ చేయడం జరిగింది. అదేవిధంగా మరొక నాలుగు స్కూల్స్ కు చెందిన విద్యార్థులకు నాలుగవ బహుమతిని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ముత్తంశెట్టి నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ ఎన్ సత్య ప్రకాష్, వివిధ ప్రైవేట్, ప్రభుత్వ స్కూల్స్ యొక్క కరస్పాండెంట్స్, ప్రిన్సిపల్స్ టీచర్స్, లయన్స్ క్లబ్ మణుగూరు సెక్రటరీ ఎం. శ్రీనివాస్ లయన్స్ క్లబ్ మణుగూరు విజన్ ప్రెసిడెంట్ బి. సురేష్, సెక్రటరీ కృష్ణ, ట్రెజరర్ వి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం



ప్రజాపక్షం/గుండాల : వినియోగ దారులకు మెరుగైన, నాన్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎన్‌పిడిసిఎల్ డైరెక్టర్ ఆపరేషన్స్ మధుసూదన్ అన్నారు. బుదవారం ముత్తాపురం గ్రామంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించిన సందర్బంగా రైతులతో ముఖాముకి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా రైతులు బోర్‌మీటర్ వద్ద తప్పని సరిగా కెపాసిటర్లు పెట్టుకోవాలని , రైతులు తమంతట తాము ఎలాంటి రిపేర్లు చేసుకోవద్దని సూచించారు. విద్యుత్ బోర్ మోటర్లవద్ద ఎలాంటి సమస్యవచ్చిన 1912కు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యుత్ భద్రతపై అవగాహన రైతులకు కల్పించారు. ఈ సందర్బంగా గుండాల, మామకన్ను, సబ్‌స్టేషన్లను సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఇ రాజచవాన్, జెఇ మహెందర్, డిఇ లు రంగస్వామి, వెంకటేశ్వర్లు, ఎడిఇలు రామరావు, రాంబాబు, మానస సిబ్బంది పాల్గొన్నారు.

# చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు..!

### గాలిపటాలు అమ్మే దుకాణాలలో అటవీశాఖ తనిఖీలు



ప్రజాపక్షం/జూలూరుపాడు: గాలిపటాలు ఎగురావేయడానికి చైనిస్ మాంజా ను ఉపయోగించవద్దు అని జూలూరుపాడు రెంజర్ ప్రసాద రావు అన్నారు. మండల కేంద్రంలోని బుధవారం ఫారెస్ట్ రేంజర్ ప్రసాదరావు ఆధ్వర్యంలో గాలి పటాలు దారాలు అమ్మే దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ ప్రసాదరావు మాట్లాడుతూ చైనీస్ మాంజా (నైలాన్ సింథటిక్ దారం) విక్రయించడం, నిల్వ చేయడం, వాడటంపై ప్రభుత్వం నిషేధం విధించిందని, పర్యావరణానికి, పక్షులకు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న ఈ ప్రమాదకరమైన మాంజాను విక్రయించడం చట్టరీత్యా నేరమని చెప్పారు. ఈ దారం గాలిపటాలు ఎగురవేసే సమయంలో మెడకు లేదా శరీర భాగాలకు తగిలితే తీవ్రమైన గాయాలు కావడమే కాకుండా ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని, గతంలో ఇలాంటి ఘటనలు ఎన్నో చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. మండలంలోని ఫ్యాన్సీ షాపులు, గాలిపటాల విక్రయ కేంద్రాలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారని, ఎక్కడైనా నిషేధిత చైనీస్ మాంజా కనిపిస్తే వెంటనే వాటిని సీజ్ చేయడమే కాకుండా సంబంధిత విక్రేతలపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కేవలం వ్యాపార లాభాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని వ్యాపారులకు సూచించారు. పర్యావరణ హితమైన, సురక్షితమైన నూలు (కాటన్) దారాలను మాత్రమే విక్రయించాలని, కొనుగోలు చేయాలని కోరారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల ఇట్టి విషయం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా ఎవరైనా రహస్యంగా చైనీస్ మాంజా విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డైల్ 100 కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రెంజర్ ప్రసాదరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలి

### ఎమ్మెల్యే పాయంకి సిపిఐ, గ్రామస్తుల వినతి

ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని విఠల్ రావు నగర్ గ్రామంలో సిపిఐ నాయకులు, గ్రామస్తులు కలిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని బుధవారం కలిసి వినతి పత్రం అందించారు. బుధవారం విఠల్ రావు నగర్ గ్రామాని సందర్శించినటు పాయం వెంకటేశ్వర్లుని సిపిఐ మణుగూరు పట్టణ కార్యవర్గ సభ్యులు మంద కోటేశ్వర రావు, బొజ్జ సదానందం, నర్సయ్య, గ్రామ పెద్దలు గుడికందుల కుమార్, తీగల కొమరయ్య, గ్రామస్తులు కలిసి గతంలో విఠల్‌రావు నగర్ గ్రామానికి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం నుండి కొంత డబ్బులు కేటాయించబడిందని చేపట్టడంతో కమ్యూనిటీ హాలుకు ఉచితంగా గ్రామస్తులు కుమార్ అనే వ్యక్తి స్థలం ఉచితంగా అందజేశారని ఎలక్షన్లు రావడంతో అవి ఆగిపోయాయన్నారు. కావున సంబంధిత ఎమ్మెల్యే ఈ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు కృషి చేసి



కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తే గ్రామ ప్రజలందరికీ చిన్నచిన్న ఫంక్షన్లకి అన్నింటికి గ్రామస్తులకు ఉపయోగకరంగా ఉంటుందని వారికి వివరించి, ఒక వినతి పత్రాన్ని అందజేశారు.

## ఐఎన్‌టియుసి సత్తుపల్లి ఏరియా ఉపాధ్యక్షుడిగా తీగల క్రాంతి కుమార్



ప్రజాపక్షం/సత్తుపల్లి: సింగరేణి లో నూతనంగా ఏర్పడిన సత్తుపల్లి ఏరియాకు ఐఎన్టీయూసీ ఆల్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి, ఐఎన్టియుసి సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ లు సత్తుపల్లి ఏరియా ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ గా తీగల క్రాంతి కుమార్ ను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తీగల క్రాంతి కుమార్ సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్ , రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ లకు అత్యంత సన్నిహితుడుగా, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ కు ముఖ్య అనుచరుడిగా ఉంటూ, యూనియన్ బలోపేతానికి కృషి చేస్తూ ఎల్లప్పుడూ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తూ కార్మికుల మన్ననలు పొందిన నాయకుడని, ఈ నియామకం పట్ల సత్తుపల్లి సింగరేణి కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారని, కష్టపడి పని చేసిన వారిని గుర్తించి ఐఎన్టీయూసీ నాయకత్వం పదవులను కేటాయించడం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాపై నమ్మకంతో సత్తుపల్లి ఐఎన్టీయూసీ యూనియన్ బాధ్యతలు అప్పగించిన అధినాయకత్వానికి, జిల్లా మంత్రివర్యులు బట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రతి కార్మికుడి పక్షాన ముందుండి పోరాటం చేస్తూ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని క్రాంతి తెలియజేశారు.

# ప్రశాంతంగా న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలి

ప్రజాపక్షం/ఆళ్లపల్లి: నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సిఐ బత్తుల సత్యనారాయణ అన్నారు. నూతన సంవత్సర వేడుకల నిబంధనలకు సంబంధించి బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం మత్తులో రోడ్లపై వేగంగా ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్కెస్ట్రా, సౌండ్ సిస్టం, డిజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డిజేలను ఆర్కెస్ట్రాలను సౌండ్ సిస్టంలను ఏర్పాటు చేస్తే కేసులు నమోదుల చేస్తామని హెచ్చరించారు. బుధవారం సాయంత్రం 6గంటల నుండి ౖండి పరిధిలోని 3 సర్కిళ్లలో(టేకులపల్లి, బోడు, ఆళ్లపల్లి)ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో 4 ప్రత్యేక పోలీస్ బృందాలతో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తారని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగటం నిషేధించామన్నారు. మైనర్లు, యువకులు బైకు రైడింగులు చేసి ప్రమాదాలకు కారణం కావద్దని సూచించారు.




మైనర్లకు బైకులు ఇచ్చే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ రాజేందర్, బోడు ఎస్ఐ పి శ్రీనివాసరెడ్డి, ఆళ్లపల్లి ఎస్ఐ సోమేశ్వర్ పాల్గొన్నారు.

# ఎవరి కోసం ఫుడ్ పార్క్..!

-ఫుడ్ పార్క్‌లో ఏం జరుగుతుంది...?
-అధికార యంత్రాంగం కాంట్రాక్టర్లకు దాసోహం అంటోదా...?
-యంత్రాలు పనిచేయక పోయినా మౌనం ఎందుకు..?
-నీళ్ళు దొరకక ఇబ్బందులు
-ముందుకు రాని పారిశ్రామిక వేత్తలు




ప్రజాపక్షం/సత్తుపల్లి: ప్రభుత్వ లక్ష్యం ప్రకారం వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించి, రైతులకు మేలు చేయాల్సిన ఫుడ్ పార్క్ ప్రాజెక్టు నేడు ప్రశ్నల గూడు అయింది. కోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించినప్పటికీ, ఆశించిన ఫలితాలు కనిపించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అసలు ఈ ఫుడ్ పార్క్ ఎవరి కోసం? రైతుల కోసమా? పారిశ్రామికవేత్తల కోసమా? లేక కాంట్రాక్టర్ల కోసమేనా? అన్న ప్రశ్నలు ప్రజల్లో వెల్లువెత్తుతున్నాయి.

### ఫుడ్ పార్క్‌లో ఏం జరుగుతోంది..?

ఫుడ్ పార్క్‌కు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన పనులు 21 సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉన్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కాలానుగుణంగా ప్రభుత్వాలు మారినా, పనుల తీరులో మాత్రం మార్పు కనిపించడం లేదని, నిర్మాణాలు అరకొరగా పూర్తవ్వడం, యంత్రాలు ఏర్పాటు చేసినా పనిచేయకపోవడం, నిర్వహణ లోపాలు స్పష్టంగా దర్శనమిస్తున్నాయని. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభమవ్వాల్సిన చోట నేడు నిశ్శబ్దం నెలకొందని ప్రజా సంఘాలు ఆగ్రహిస్తున్నాయి.అధికార యంత్రాంగం

### కాంట్రాక్టర్లకు దాసోహమా...?

ఫుడ్ పార్క్ అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లకు అధికార యంత్రాంగం అండగా నిలుస్తోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. నాణ్యత లోపించిన పనులు, గడువులు దాటినా చర్యలు లేకపోవడం అనుమానాలకు బలం ఇస్తోందని వామపక్ష నాయకులంటున్నారు. పనులు సకాలంలో పూర్తికాకపోయినా, యంత్రాలు పనిచేయకపోయినా సంబంధిత అధికారులు మౌనం పాటించడమే వెనుక ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.పనిచేయని యంత్రాలు ప్రశ్నించని అధికారులు కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన యంత్రాలు ప్రస్తుతం మూలకు చేరాయి, నీటి వసతి లేక పలు యూనిట్లు ప్రారంభం కాకుండా నిలిచిపోయాయి. యంత్రాలు పనిచేయకపోవడంపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఎందుకు స్పందించడంలేదన్న ప్రశ్నలకు సమాధానం లభించడం లేదు. ఇది నిర్లక్ష్యమా? లేక లోతైన అవినీతి ముడిపడి ఉందా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు ప్రజలు.

### 21 ఏళ్ల పనుల్లో ఎవరి అవినీతి ఎంత..?

ఇరవై ఒక సంవత్సరాలుగా సాగుతున్న పనుల్లో ఎన్ని నిధులు విడుదలయ్యాయి? ఎంత పని వాస్తవంగా పూర్తయింది? మధ్యలో ఎవరి జేబులు నిండాయి? అనే ప్రశ్నలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆడిట్ నివేదికలు, సామాజిక తనిఖీలు ఎందుకు ముందుకు రావడం లేదన్నది మరో కీలక అంశం.

### అరకొర సదుపాయాలు. నీళ్లకే కష్టాలు...

ఫుడ్ పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటవ్వాలంటే నిరంతర నీటి సరఫరా అత్యవసరం. కానీ నేడు నీళ్ల కోసం కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు. ఈ పరిస్థితుల్లో పారిశ్రామికవేత్తలు ముందుకు రాకపోవడంలో ఆశ్చర్యం ఏముంది..?

### ముందుకు రాని పారిశ్రామికవేత్తలు...

ప్రభుత్వం ఫుడ్ పార్క్‌ల ద్వారా పెట్టుబడులను ఆకర్షించాలన్న లక్ష్యం పెట్టుకున్నా, వాస్తవ పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. మౌలిక వసతుల లోపం, అనిశ్చిత వాతావరణం, పరిపాలనా నిర్లక్ష్యం వల్ల పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపడం లేదు. దీని ప్రభావం నేరుగా రైతులు, స్థానిక యువతపై పడుతోంది.

# పది విద్యార్థులు ఉత్తమ గ్రేడ్లు సాధించాలి

### - ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్

ప్రజాపక్షం/మణుగూరు: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థినీ విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉత్తమ గ్రేడ్లు సాధించి మీ తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాఠశాలకు, మీ గ్రామానికి మంచి పేరు తీసుకొని రావాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ విద్యార్థినీలకు సూచించారు. బుధవారం మణుగూరు మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించి గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఉన్నత పాఠశాల, తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ముందుగా గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించి, ప్రైమరీ, పదో తరగతి విద్యార్థినిలతో ప్రత్యేకంగా తరగతి గదిలో ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాల గురించి ప్రైమరీ విద్యార్థినిలతో బోర్డుపై వ్రాయించి వారికి పలు సూచనలు చేసిన అనంతరం పదవతరగతి విద్య విద్యార్థినిలతో ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు అనేవి మీ జీవితానికి ఎంతో ముఖ్యమైనవని, అందుకు విద్యార్థినిలు ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధగా విని అర్థం చేసుకొని మరల మననం చేసుకుంటూ కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని, మీ చదువుతోపాటు భవిష్యత్తులో మీరు ఏమి కావాలని మనసులో ఒక గోల్ ఎంచుకుని కెరీర్ గైడెన్స్ సంబంధించిన అంశాలపై దృష్టి సారించి ఇప్పటినుండే ప్రిపేర్ కావాలని అన్నారు. గత సంవత్సరం ఈ పాఠశాలలో చదివిన పదవ తరగతి విద్యార్థినిలు 99% గ్రేడ్ సాధించారని, ఈ సంవత్సరం 100% గ్రేడ్ వచ్చేలా విద్యార్థినిలు కంకణం కట్టుకోవాలని అన్నారు. సబ్జెక్ట్ టీచర్లు విద్యార్థినిలు ఏ సబ్జెక్టులు అయితే వెనుకబడి ఉన్నారో వారిపై ప్రత్యేక దృష్టి సారించి అదనపు పీరియడ్లు తీసుకొని పరీక్షలు నాటికి



వారు పూర్తిస్థాయిలో ప్రతి సబ్జెక్టుపై భయం లేకుండా పరీక్షలు రాసేలా చూడాలని అన్నారు. అనంతరం పాఠశాలలో మెన్స్ పార్క్ కంప్యూటర్ లో పిల్లలు పదాలకు సంబంధించిన మ్యాపింగ్ ఎలా చేస్తున్నారో పరిశీలించారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం పనులను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తిచేసి మార్చి 31 నాటికి పూర్తిగా అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి అయ్యేలా చూడాలని ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్ కు ఫోన్ ద్వారా ఆదేశించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటర్ లిస్ట్ కు సంబంధించిన అంశాలను పరిశీలించి ఓటర్ లిస్టులో ఫ్యామిలీ మెంబర్స్ మ్యాడింగ్, మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేసి కుటుంబంలోని సభ్యుల అందరి పేర్లు సక్రమంగా నమోదు చేయాలని తహశీల్దార్ కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మహాలక్ష్మి, మణుగూరు తాసిల్దార్ అద్దంకి నరేష్, తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం ఆందోళన అవసరం లేదు

ప్రజాపక్షం/ములకలపల్లి: రైతులు యూరియా కొరకు ఆందోళన పడవలసిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి రమేష్ బాబు అన్నారు. మండలంలో బుధవారం నుండి 1152 యూరియా బస్తాలు( సొసైటీ 473, మన గ్రోమోర్ నందు 535, శ్రీ సాయి శ్రీనివాస ట్రేడర్స్ 144 బస్తాలు)అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ఎవరు యూరియా కొరత ఉందనే అపోహలు నమ్మవొద్దన్నారు. యాసంగి పంటలకు సరిపడా యూరియా, ఇతర ఎరువులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌లో కాకుండా మునపాటి మాదిరగానే రైతులు యూరియా కొనుగోలు చేయవచ్చాన్నారు.

## ఉపాధి కూలీలకు సామగ్రి పంపిణీ



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: మర్కోడు గ్రామ పంచాయితీలో ఉపాధి హామీ పథకం కలిగిన కుటుంబాలకు సర్పంచ్ సుతారి రమాదేవి, ఉపసర్పంచ్ వగలబోయిన సతీష్, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో గడపార, పారలు, తట్టలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయితీ సెక్రటరీ రాధాకృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుతారి కృష్ణ, గ్రామ పంచాయితీ సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్ రాములు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## అమృతమ్మ జ్ఞాపకార్థం బల్ల వితరణ



ప్రజాపపక్షం/ఆళ్లపల్లి: మర్కోడు గ్రామ పంచాయితీలో పంది అమృతమ్మ జ్ఞాపకార్థంగా ప్రజలు కూర్చునే బల్లను దాతలుగా యాసరపు శైలజ జనార్ధన దంపతులు అందించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ సుతారి రమాదేవి, ఉపసర్పంచ్ వగలబోయిన సతీష్, వార్డు మెంబర్లు పూణెం నరేందర్, కొమరం రామారావు, కొమరం నాగార్జున, పార్టీ సీనియర్ నాయకులు సుతారి కృష్ణ, తాళ్లపల్లి వెంకన్న, వగలబోయిన లాలుబాబు, కీసరి బాబు, పూణెం సురేష్, యాసారపు బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయురాలు కమల ఉద్యోగ విరమణ



ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి హై స్కూల్ ఉపాధ్యాయురాలు నల్లాని కమ ల టీచర్ ఉద్యోగ విరమణ కార్యక్రమం లో మాజీ వైస్ ఎంపీపీ ఇమ్మడి రమాదేవి దంపతులు పాల్గొని శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా కాంగ్రె స్ పార్టీ జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు కలమ ఎంతో కష్టపడి మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. స్టూడెంట్స్ భవిష్యత్తు కోసం అహర్నిశలు పాటు పడ్డారని అన్నారు. ఈ ఊరులో పుట్టి పెరిగిన ఉపాధ్యాయురాలుగా ఇక్కడే చాలా సంవత్సరాలు పని చేసే ఇక్కడే ఉద్యోగ విరమణ కావడం అదృష్టమని అన్నారు. వారి దంపతుల శేష జీవితం చాలా హ్యాపీగా సాగాలని కోరారు.

## ఊకె పాపయ్య మృతికి సిపిఐ నివాళి



ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండలంలోని సీతారాంపురం గ్రామ పంచాయితీకి చెందిన సిపిఐ మండల సీనియర్ నాయకులు ఊకే పాపయ్య మరణించిన విషయం తెలుసుకుని బుధవారం వారి నివాసానికి వెళ్లి పార్థివదేహానికి అరుణ పతాకం కప్పి పూలమాల వేసి సిపిఐ నాయకులు ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, ఏఐటియూసి జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, సీతారాంపురం సర్పంచ్ సప్క పిచ్చయ్య, ఏఐటియూసి మండల అధ్యక్షులు రాయపూడి రాజేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అక్కినపల్లి నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

## సుబ్బమ్మకు ఘన నివాళి



ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని ముత్యాల గూడెం గ్రామంలో డ్వాక్రా మహిళలకు గ్రామ దీపికగా గత కొన్ని సం వత్సరాల నుండి ప్రజలకు సేవలు అందిస్తున్నా పేరెల్లి ఉపేందర్‌కి మాతృవియోగం బుధవారం జరగ గా మృతురాలు సుబ్బమ్మకి సిపి ఎం పార్టీ నాయకులు పేరెల్లి వాసు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సుబ్బమ్మకు సంతాపం తెలియజేసి, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తాళ్లపల్లి పెద్ద వీరయ్య, పేరెల్లి పెద్దబాబు, యేసు మాతంగి ప్రభాకర్, పేరెల్లి ఉప్పలయ్య, మధు సురేందర్, పేరెల్లి శ్రీను, ఎర్రగడ్డ శ్రీను, తాళ్లపల్లి మురళి, అలాగే సిపిఎం పార్టీ నాయకులు తాళ్లపల్లి మనోజ్ కుమార్, పేరెల్లి మహేష్, పేరెల్లి వెంకటరమణ, తాళ్లపల్లి మనోహర్, తాళ్లపల్లి మదర్, పేరెల్లి రఘు, గోపి, దుర్గయ్య, పేరెల్లి శ్రీను, తదితరులు పాల్గొని సిపిఎం పార్టీ గ్రామ శాఖ తరపున సంతాపం, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళికలు



**-మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**
**-పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**ప్రజాపక్షం/కల్లూరుః** గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధ చర్యలు చేపడుతుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం కల్లూరు మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. రూ. 2 కోట్లతో నారాయణపురం నుండి పేరువంచ వరకు బిటి రోడ్డు, రూ. 4 కోట్లతో నారాయణపురం నుండి కొర్లగూడెం ఆర్ అండ్ బి రోడ్ నుండి రామకృష్ణపురం వరకు బిటి రోడ్డు, రూ. 7 కోట్లతో పేరువంచ నుండి కుప్పనకుంట్ల వరకు బిటి రోడ్డు, రూ. 2 కోట్లతో కొత్త నారాయణపురం నుండి ఎన్ఎస్పీ కెనాల్ లిఫ్ట్ వరకు నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎటువంటి వెనుకడుగు వేయకుండా చర్యలు తీసుకుంటుందని అన్నారు. రాబోయే రోజుల్లో వందకు వంద శాతం ప్రతి గ్రామానికి అవసరమైన రోడ్లు, మౌళిక సదుపాయాల కల్పన చేస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చిన ప్రతి మాట నెరవేర్చేందుకు ప్రభుత్వం పని చేస్తున్నదని, పేదలకు సన్న బియ్యం సరఫరా, కొత్త రేషన్ కార్డుతో పాటు పాత రేషన్ కార్డులో పేర్లను చేర్చడం, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, పిల్లలకు మంచి విద్య అందించాలనే లక్ష్యంతో గురుకులాల్లో 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచడం జరిగిందని అన్నారు. రైతును రాజు చేసే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం వచ్చిన మొదటి 9 నెలల్లోనే 21 వేల కోట్ల రూపాయలు 25 లక్షల రైతన్నలకు చెందిన రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేశామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం మొదటి విడతలో నాలుగున్నర లక్షలు ఇండ్లు మంజూరు చేసిందని, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు ఇస్తూ, ప్రతి సోమవారం నాడు లబ్ధిదారులు కట్టిన ఇంటి లెవెల్ ననుసరించి చెల్లింపులు చేస్తున్నామని అన్నారు. వచ్చే ఏప్రిల్ నుండి రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్పర్సన్ నీరజ ప్రభాకర్, మండల తహసీల్దార్ సాంబ శివుడు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరతను నివారించండి



**-రైతు సంఘాల వినతి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని కొరత లేకుండా యూరియాను అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు దొండపాటి రమేష్, తెలంగాణ రైతు సంఘం అధ్యక్షులు బొంతు రాంబాబు లు మాట్లాడుతూ ఏడాది కాలంగా యూరియా సరఫరా చేయడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్ష చూపుతుందన్నారు. వ్యవసాయ రంగాన్ని దివాళా తీయించేందుకు బిజెపి నేతృత్వంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరంతరం కుట్ర చేస్తుందని వారు ఆరోపించారు. ఒక పక్క ఎరువుల ధరలు పెంచడం, మరో పక్క యూరియా కొరతను సృష్టించడం వెనక కార్పొరేట్ల కుట్ర దాగి ఉందన్నారు. తక్షణమే యూరియా కొరతను నివారించేందుకు రైతులకు సరిపడ యూరియాను దిగుమతి చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు ఎస్కె మీరాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# టిజివోస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. బుధవారం ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి టిజివోస్ యూనియన్ 2026 నూతన సంవత్సర క్యాలెండర్, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు, ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని, ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజివో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి, కేంద్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేషప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులు గంగవరపు నరేందర్, మల్లెల రవీంద్రప్రసాద్, ట్రెజరర్ సూరంపల్లి రాంబాబు, హౌజ్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి పి. విజయ్‌కుమార్, మహిళా అధ్యక్ష, కార్యదర్శులు జి. ఉషశ్రీ, సుధారాణి, పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా పంపిణీ విధానాన్ని

# హైదరాబాద్ కమిషనరేట్ అధికారుల పరిశీలన



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని జీళ్ళచెరువు చేగొమ్మ, కూసుమంచిలోని మన గ్రోమోర్ సెంటర్లలో యూరియా పంపిణీ విధానాన్ని హైదరాబాద్‌లోని కమిషనరేట్ నుండి వచ్చిన ప్రత్యేక అధికారి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ చంద్రశేఖర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మొక్కజొన్న, వరి నాట్లు జరుగుతున్నందున ప్రధానంగా ఈ రెండు పంటలు వేసిన రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు కావలసిన అంత యూరియా అందుబాటులో ఉందని రైతులు కంగారు పడవలసిన అవసరం లేదని అవసరానికి అనుగుణంగా యూరియా నిల్వలు ఉంచుతామని, వాన కాలంలో ఏర్పాటు చేసిన సబ్ సెంటర్ల ద్వారా యూరియా పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంటన కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సతీష్, మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, ఏఈవోలు జానీ, రవి కుమార్, రవీందర్ పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మల నూతన సంవత్సర శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ప్రజలకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2026 కొత్త సంవత్సరంలో అందరికి మంచి జరగాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరి సంపదలతో సుభిక్షంగా ఉండాలని భగవంతున్ని కోరుకుంటున్నట్లు తెలిపారు.

# పువ్వాడ నగర్‌లో పర్యటించిన తుమ్మల యుగంధర్



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని పువ్వాడ నగర్ గ్రామంలో కాంగ్రెస్ జిల్లా యూత్ నాయకులు తుమ్మల యుగంధర్ పర్యటించారు. బుధవారం తుమ్మల యుగంధర్ పువ్వాడ నగర్ గ్రామంలో పర్యటించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ షేక్ సిద్దిఖ్ గ్రామంలో ఉన్న నీటి సమస్యలతో పాటు ఇంటి పన్నులు, పట్టా సమస్యలను తుమ్మల యుగంధర్ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. తుమ్మల యుగంధర్ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాభివృద్ధికి నాయకులు కృషి చేయాలని యుగంధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, పార్టీ ఇంచార్జి ఆస్రీఫ్, ఉప సర్పంచ్ ఆదూరి రాణి, వార్డు సభ్యులు మద్దిరాల శ్రీదేవి, సూరబోయిన రజిత, నాయకులు కాంపాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం పువ్వాడ నగర్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ జ్యోతి, సర్పంచ్ సిద్దిఖ్, కార్యదర్శి మహేష్ లు నీటి కొరతను తీర్చేందుకు బోర్లను పరిశీలించారు.

# న్యాయవాదుల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/మధిర :** బార్ కౌన్సిల్ ఇండియా సభ్యుడు పి.విష్ణు వర్ధన్‌రెడ్డి రూపొందించిన 2006 సంవత్సరానికి సంబంధించిన డైరీని, ప్యాకెట్ క్యాలెండర్‌ను మధిర కోర్టులో ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి వేముల దీప్తి బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడతూ న్యాయవాదులు అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ డైరీ న్యాయవృత్తిలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. న్యాయవాదులకు అవసరమైన చట్టపరమైన సమాచారం, ముఖ్యమైన నోట్స్ అనుకూలంగా ఈ డైరీని రూపొందించటం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, ఇతర కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# వార్డ్ వైజ్ డ్రాఫ్టరోల్ పరిశీలన



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీని అడిషనల్ కలెక్టర్ శ్రీజ బుధావరం తనిఖీ చేశారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా తయారు చేస్తున్న వార్డ్ వైజ్‌డ్రాఫ్టరోల్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ ఆర్ఐ శ్రీధర్‌రెడ్డి, మేనేజర్ మణి, టిపిఓ సతీష్, మున్సిపాలిటీ సిబ్బంది, బిఎల్ఓలు పాల్గొన్నారు.

# జీవాలకు ఉచిత నట్టల నివారణ మందు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని ఆరెకోడుతండా, చింతపల్లిలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందులను వేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు ఆరెంపుల మరియమ్మ, గుగులోత్ మంగమ్మలు హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి అనంతు హరిష్, వైద్య సిబ్బంది వినయ్, సందీప్, శ్రీను, జీవాల పెంపకం దారులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/చింతకాని :** పేదింటి ఆడబిడ్డ పెళ్లికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన కళ్యాణలక్ష్మి , షాధీముబారక్ చెక్కులను బుధవారం చింతకాని రైతు వేదికలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సంక్షేమం , అభివృద్ధి జోడెడ్లలాగా పనిచేస్తుందని, పేదల అభ్యున్నతికి పథకాలెన్నో అమలు చేస్తుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. 15 గ్రామాలకు చెందిన 64 మంది లబ్దిదారులకు రూ.64.07 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఎంపీడీవో చంచు శ్రీనివాసరావు, నూతన సర్పంచ్‌లు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# ఉద్యమాలు, త్యాగాలతో ఈ నూరేళ్లు పునీతం

- సిపిఐ శత వసంత వైభవాన్ని ఘనంగా జరుపుకుందాం
- 18న ఖమ్మం కేంద్రంగా ముగింపు సభ
- 3న చర్లలో ప్రచార జాతాను ప్రారంభించనున్న నారాయణ
-సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా




**ప్రజాపక్షం/చర్ల :** ఉద్యమాలు, త్యాగాలతో ఈ శతవసంతం పునీతంగా మారిందని, సిపిఐ నూరేళ్ల వేడుకను ఘనంగా నిర్వహించుకుందామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. మండల కౌన్సిల్ సమావేశం బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో పాలెం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యాతిధిగా హాజరైన ఆయన మాట్లాడారు. దేశస్వతంత్రాని కంటే ముందే సిపిఐ ఆవిర్భవించిందని, ఆ నాటి నుండి నేటి వరకు ప్రజా క్షేత్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు సాగిస్తోందని తెలిపారు. ఎన్నో రాజకీయ పార్టీలు ఈ దేశంలో కనుమరుగై పోయాయని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం త్యాగాలకు సైతం వెనుకాడని సిపిఐ మరో వందేళ్లు కూడా ఇదే ఉద్యమ స్ఫూర్తితో మందుకు సాగుతుందన్నారు. ఈ నూరేళ్ల త్యాగాలు, ఉద్యమాలు ప్రజల్లోనికి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని, చరిత్రను వాడవాడలా వివరించాలని సూచించారు. శత వసంత ఉత్సవ ముగింపు సభ ఈనెల 18న ఖమ్మం నగరం కేంద్రంగా 5 లక్షల మందితో అట్టహాసంగా జరగనుందని, ఈ వేడుకకు ప్రపంచ దేశాలనుండి కమ్యూనిస్టు ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. ఈ ముంగింపు సభ దేశ రాజకీయాల్లో సువర్ణ అధ్యాయంగా మిగలనుందని, కమ్యూనిస్టుల పని అయిపోయిందని అవాకుల చెవాకులు కూసే వారికి ఇది గుణ పాఠం కానుందన్నారు. నేడు ప్రపంచం యావత్తు కమ్యూనిస్టులను కోరుకుంటుందని గుర్తు చేశారు. ఈ శతవసంత ఉత్సవ ప్రచార జాతాను ఈ నెల 3న చర్ల మండల కేంద్రంలో సిపిఐ సీనియర్ నాయకులు, సిపిఐ జాతీయ కంట్రోల్ కమీషన్ చైర్మన్ కే నారాయణ ప్రారంభిస్తారని అన్నారు. ముగింపు సభకు ప్రజలను పెద్ద ఎత్తున తరలించాలని, ఇందు కోసం ఇప్పటినుంచే కార్యాచరణ ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, భద్రాచలం డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వర రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ, మండల కార్యదర్శి నూపా పోతయ్య, సహాయ కార్యదర్శులు కోటి ముత్యాల రావు, నాని పల్లి భద్రం, మండల ఆర్గనైజర్ జాకీర్ హుస్సేన్, సర్పంచ్‌లు నూపా సునీత, శ్యామల తిరుపతిరావు, మడివి శ్రీనివాస్, కల్లూరి సీతారాములుతో పాటు వెంకట నర్సింహా, సీతారామయ్య, అనసూయ, రాజారావు, ముత్తయ్య, రాజు దేవయ్య, సుక్కయ్య, వెంకట్, సింగయ్య, లక్ష్మయ్య, శంకర్, వామనరావు, సీతారాములు, వెంకటేశ్వర్లు, నర్సయ్య, శంకర్, నాగేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

**దుమ్ముగూడెంలో...**




సిపిఐ శతవంసతాల ముగింపు సభ జీపు జాతాను జయప్రథం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. మండల కౌన్సిల్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ సిపిఐ శత వంసత ఉత్సవ వేడుక ఖమ్మం కేంద్రంగా జనవరి 18న జరుగుతుందని చెప్పారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 3న చర్ల మండల కేంద్రంలో జీపుజాతాను సీనియర్ నాయకులు కే నారాయణ ప్రారంభిస్తారని, ఈ జాత 7వ తేదిన సుజాతనగర్ మండలంలో ముగుస్తుందన్నారు. 5 లక్షల మందితో ఖమ్మంలో జరిగే ముగింపు వేడుకకు భారీ జనసమీకరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బొల్లోజు వేణు, సహాయ కార్యదర్శి తాటిపూడి రమేష్, సీనియర్ నాయకులు రామిరెడ్డి, మందపాటి సుధాకర్ రెడ్డి, కాకా వెంకటేశ్వరరావు, పాయం రాజు, పాయం ఎర్రయ్య, గొంది నాగేశ్వరరావు, కొర్సా కోటేష్, నూతన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు పాల్గొన్నారు.

# ఎక్స్‌లెంట్‌లో ఘనంగా న్యూఇయర్ వేడుకలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురంలోని ఎక్స్‌లెంట్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా, ఆనందంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పాఠశాల ప్రాంగణాన్ని రంగు రంగుల అలంకరణలతో అందంగా ముస్తాబు చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. నృత్యాలు, పాటలు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్స్ ఖాదర్, యూసఫ్‌లు మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సృజనాత్మకత, ఐక్యత పెంపొందించడమే ఇలాంటి వేడుకల లక్ష్యమని ఇక్కడ బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలందరి కుటుంబాలలో ఈ నూతన సంవత్సరం ఆనందాలు నింపాలని ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు లెనిన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ నూతన సంవత్సరం విద్యార్థులకు కొత్త ఆశలు, లక్ష్యాలు తీసుకురావాలని, చదువుతో పాటు నైతిక విలువలు కూడా పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం బోధన సిబ్బంది పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు, సిబ్బందికి, తల్లిదండ్రులకు నూతన సంవత్సర వేడుకలు శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా నూతన సంవత్సర వేడుకలు




**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురంలోని ఎమిలి పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా, సందడి మధ్య నిర్వహించబడ్డాయి. ఈకార్యక్రమానికి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ క్రమ శిక్షణ, సృజనాత్మకత, ఐక్యత పెంపొందించే ఇలాంటి వేడుకల నిర్వహించడం మంచి విషయమని తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ములకలపల్లి గోపినాథ్ మాట్లాడుతూ నూతన సంవత్సరం విద్యార్థులకు కొత్త ఆశలు, లక్ష్యాలు తీసుకురావాలని, చదువుతో పాటు నైతిక విలువల కూడా పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నూతన సంవత్సర ఆహ్వానం పలుకుతూ కేకులు కట్ చేసి పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మొత్తంగా ఎమిలి పాఠశాలలో నిర్వహించిన న్యూఇయర్ వేడుకలు ఆనందోత్సాహాలతో విజయవంతంగా ముగిశాయి. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయురాలులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ స్టేషన్ బస్తి శాఖ కార్యదర్శి మృతి



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు పట్టణంలోని 21వ వార్డుకు చెందిన సిపిఐ కార్యదర్శి కొత్తపల్లి సాంబమూర్తి బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుందని కుటుంబ సభ్యులకు తెలపగా వారు హుటాహుటిన ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. సింగరేణి ఉద్యోగంలో 34 సంవత్సరాలు ఉద్యోగం చేసి, సిపిఐ పార్టీ, ఏఐటియూసి సంఘం కోసం అహర్నిశలు కృషి చేశారు. కొత్తపల్లి సాంబమూర్తి మృతదేహాన్ని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, సిపిఐ పట్టణ మండల కార్యదర్శి బాస శ్రీనివాసరావు, బొప్పిశెట్టి సత్యనారాయణ, ఏఐటియూసి బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, ఉపాధ్యక్షులు దాసరి రాజారామ్, రాజకీయ పార్టీల నేతలు, కార్మిక సంఘాల నాయకులు సందర్శించి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో పలువురి చేరిక



**ప్రజాపక్షం/కూసుమంచి:** పంచాయితీ ఎన్నికల ప్రక్రియ ముగిసినా బిఆర్‌ఎస్‌కు వరుస షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. తాజాగా కూసుమంచి మండలం జుజ్జులరావుపేట గ్రామంలో బిఆర్‌ఎస్ పార్టీకి ఆ పార్టీ ముఖ్య నేతలే గట్టి ఎదురుదెబ్బ ఇచ్చారు. మాజీ సర్పంచ్ పడిశాల గోపి, మాజీ ఎంపిటిసి బారి నాగేశ్వరరావు తమ అనుచర వర్గంతో కలిసి గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ బాట పట్టారు. ప్రధాన నేతలు మూకుమ్మడి వలస కంచర్ల జీవన్‌రెడ్డి నాయకత్వంలో గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ గ్రామ కార్యదర్శి శ్రీరాముల రాము, మల్లెబోయిన వీరభద్రం, పడిశాల మహేష్ సహా దాదాపు 45 కుటుంబాలు బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామంలో ఆ పార్టీకి వెన్నెముకగా ఉన్న నేతలే ఒక్కసారిగా పార్టీ వీడటంతో జుజ్జులరావుపేటలో బిఆర్‌ఎస్ ఖాళీ అయినట్లయ్యింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలే తమను కాంగ్రెస్ వైపు నడిపించాయని ఈసందర్భంగా పడిశాల గోపి, నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలిచే నాయకత్వమే మాకు ముఖ్యమని, అందుకే కాంగ్రెస్‌లో చేరామని స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలో పట్టున్న నాయకులు హస్తం గూటికి చేరడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ , వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొని కొత్తగా చేరిన వారికి ఆహ్వానం పలికారు.

# పేదలకు బ్లాంకెట్ల పంపిణీ



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలం గుర్వాయిగూడెం గ్రామంలోని నిరుపేదలు, అనారోగ్యం తో బాధపడుతున్నటువంటి పేదలకు కూసుమంచిలోని గ్లోబల్, రెయిన్బో స్కూల్ జెవిఆర్ కళాశాల ఆధ్వర్యంలో స్వర్గీయ ఎండి రషీద్ అహ్మద్ జ్ఞాపకార్థం బుధవారం బ్లాంకెట్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ బిక్షాం నాయక్, రషీద్ అహ్మద్ సతీమణి షాహిదా బేగం కూతరు నాజియా, గ్రామ ఉప సర్పంచ్ పందిరి సంపత్‌రెడ్డి పంచడం జరిగింది. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎస్ వెంకటరెడ్డి, పందిరి నర్సిరెడ్డి, కిరణ్ రెడ్డి, ఎం వెంకన్న, వార్డు మెంబర్ సతీష్, వార్డ్ మెంబర్ రమాదేవి, వార్డ్ మెంబర్ దుర్గారావు, వార్డ్ మెంబర్ పద్మ, బి వెంకటరెడ్డి, సైదులు, సీతారాములు, విజయనిర్మల, లక్ష్మి , చిన్న వీరయ్య కుమార్, వినీత్, హుస్సేన్, భాను, తదితరులు పాల్గొన్నారు.

## పాత కక్షలతో వ్యక్తి హత్య

**ప్రజాపక్షం/ ఖమ్మం క్రైం :** నగరంలోని బాలాజీ నగర్‌లో పాత కక్షలతో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనకు సంబంధించి టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బాలాజీనగర్‌కు చెందిన షేక్ రెహ్మాన్ (35)కు లెనిన్ నగర్‌కు చెందిన షేక్ బాజీకి కొంత కాలంగా వివాదాలు జరుగుతున్నాయి. షేక్ రెహ్మాన్ మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. ఈనెల 29న బాలాజీనగర్‌లోని ఓ ప్రైవేటు మెడికల్ ల్యాబ్ మెట్లపై అధిక మద్యం సేవించి పడుకున్నాడు. విషయం తెలుసుకున్న బాజీ అక్కడకు చేరుకుని అతనిపై దాడి చేసి పరారయ్యాడు. ఇది గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా వారు ఘటన స్థలానికి చేరుకుని బాధితున్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు రెహ్మాన్ సోదరి సాధిక, బావ షరీఫ్‌లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తాత్కాలిక ఆనందం కోసం
# భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు



**ప్రజాపక్షం/మణుగూరు:** నూతన సంవత్సరం వేడుకలను ఆనందంగా, కానీ చట్టానికి లోబడి జరుపుకోవాలని డీఎస్పీ రవీందర్ రెడ్డి, మణుగూరు సబ్ డివిజన్ సీఐ నాగబాబు మణుగూరు సబ్ డివిజన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 31 సందర్భంగా మణుగూరు సబ్ డివిజన్ పరిధిలో విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించబడతాయి అన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవు అన్నారు. నూతన సంవత్సర వేడుకల పేరిట డీజేలు, అధిక శబ్దం వచ్చే సౌండ్ బాక్సులు వినియోగించినా ఉపేక్షించేది లేదు అన్నారు. ప్రజలు ప్రశాంతతకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అన్నారు. అలాగే మైనర్లు వాహనాలు నడిపి పట్టుబడితే, వాహనం నడిపిన మైనర్ తో పాటు వాహనం ఇచ్చిన తల్లిదండ్రులు లేదా యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తాం అన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవిస్తూ, ఇతరుల ప్రాణాలకు ప్రమాదం కలగకుండా, సురక్షితంగా నూతన సంవత్సరాన్ని స్వాగతించాలి అన్నారు. మీ కుటుంబం ఆనందంగా ఉండాలంటే, మీరు బాధ్యతగా ఉండాలి అన్నారు.

# నూతన సంవత్సర శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ దంపతులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2026 కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నామని ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబం సిరిసంపదలతో సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే దంపతులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# త్వరలో నవ భద్రాద్రి

- మాస్టర్ ప్లాన్‌పై మంత్రి తుమ్మల చర్చ
- కుంభ మేళా తరహాలో గోదావరి పుష్కరాలు
- మూడేళ్లలో విస్తరణ పనులు పూర్తి
- ఆగమ శాస్త్రాను సారం కట్టడాలు
- ఆలయాభివృద్ధికి తుమ్మల మార్క్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాద్రి త్వరలో నవ భద్రాద్రిగా మారనుంది. ఇందుకు తుమ్మల మరో సారి మాస్టర్ ప్లాన్ పై బుధవారం చర్చించారు. గత బిఆర్ఎస్ పాలనలో మంత్రిగా ఉన్న తమ్మల భద్రాద్రి సుందరీకరణకు తనదైన శైలిలోశ్రీ కారం చుట్టారు. కానీ అడుగులు ముందుక పడ లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాద్రిని దేశానికే తలమానికంగా అభివృద్ధి చేస్తామని చెప్పగా, ఇప్పుడు అందుకు సంబంధించిన అడుగులు శరవేంగగా ముందుకు పడుతున్నాయి. ఈ బాధ్యతను కూడా తుమ్మల మరో సారి తన భుజ స్కంధాలపై ఎత్తుకున్నారు. ఇప్పటికే మాడ వీధుల విస్తరణ పనుల్లో భాగంగా భూ సేకరణ పూర్తయింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడదల చేయడంతో భూ సేకరణ సజావుగా సాగింది. ఈ మాఢ వీధులతో పాటు ఆలయాభివృద్ధి పనులను మూడేళ్లలో పూర్తి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్దమైంది. దీంతో భద్రాద్రి ఆలయానికి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంత్ రేడ్డి నేతృత్వంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సారధ్యంలో నూతన శోభ సంతరించు కోనుంది. భద్రాద్రి రామయ్య ఆలయానికి నానాటికీ భక్తుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో ఆలయ విస్తరణ ఎంతో అవసరంగా మారింది. ఆగమ పండింతులు రూపొందించిన నమూనాల ప్రకారం అత్యంత సుందరంగా భద్రాద్రి ఆలయాభివృద్ధికి అడుగులు పడుతు న్నాయి. 2027 లో జరగనున్న గోదావరి పుష్కరాలను సైతం కుంభ మేళా తరహాలో జరిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 2003,2015లో జరిగిన గోదావరి పుష్కరాల సమయంలో తుమ్మల నాగేశ్వరరావుమంత్రిగానే ఉన్నారు. ఈ సారి 2027లో జరిగే పుష్కరా లకు సైతం ఆయన మంత్రిగా ఉండటం విశేషం. పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పా ట్లపై ప్రణాళికలు రూపొందించారు. వసతి సదుపాయం, మెడికల్






క్యాంపులు, శానిటేషన్, తాగునీరు, రవాణా తది తర విషయాలపై ఇప్పటికే తగిన ప్రణాళికలు సిద్ధం చేశారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకు, ప్రస్తుత పరిస్థితులు, పెరిగే భక్తుల సంఖ్యకు అనుగుణంగా తుమ్మల దిశా నిర్దేశం చేస్తు న్నారు. వాతావరణ పరిస్థి తుల దృష్ట్యా శానిటేషన్ అత్యంత కీలకం కావడంతో పాటు పుష్కరాలు వర్షాకాలంలో జరగు తుంటంతో కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోనున్నారు. గోదావరి పుష్క రాలు ప్రభుత్వ ప్రతిష్టను పెంచేలా ఉండాలని తుమ్మల దేవాదాయ కమీషనర్ హరీష్‌ను ఆదేశించారు.

### ఆలయాభివృద్ధికి తుమ్మల మార్క్...

భద్రాద్రి ఆలయాభివృద్ధిపై తుమ్మల తనదైన మార్కు వేయనున్నారు. గత ప్రభుత్వం ఆయనే మాస్టర్ ప్లాన్‌లు తయారు చేయించి చర్యలకు పూనుకున్నప్పటికీ పరిస్థితులు అనుకూలించక పోవడంతో ముందడుగు పడలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తుమ్మల మంత్రిగా కొన సాగుతున్నారు. దీంతో నవభద్రాద్రికి తనదైన మార్కు పడనుంది. భద్రా చలాభివృద్ధిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తొలినాళ్ల నుండి సాను కూల దృక్పదంతోనే ఉన్నారు. ఆ నాటి తెలుగుదేశంలో ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న తుమ్మల పట్టుపట్టి గోదావరి కరకట్ట నిర్మాణం చేప ట్టారు. ఈ కట్ట ఏర్పాటు చేయడం వల్ల గోదావరి మునక నుండి పట్టణం సురక్షితంగా ఉంది. లేదంటే చిన్నపాటి వరద వచ్చినా పట్టణంలోనికి ప్రవేశించి తీవ్ర ఇబ్బందుల పాలు చేసేది. ఈ ప్రాంతంలో రోడ్లు, వంతె నలు, చెక్ డ్యాంల నిర్మాణంలో మంత్రి తుమ్మల పాత్ర మరువలేనిది. నవభద్రాద్రి మెరవాలని, మంత్రి తుమ్మల ఆలోచన ఆ శ్రీరాముని దివ్యా శిస్సులతో ముందుకు సాగాలని రామ భక్తులు కోరుకుంటున్నారు.

# బాధ్యతాయుతంగా విధుల నిర్వహణ

**-డిపివో ఆశాలతను సన్మానించిన కలెక్టర్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ లో గత 31 సంవత్సరాలుగా డిపివో ఆశాలత వివిధ హోదాలలో పని చేస్తూ అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రజల మన్న నలు పొందారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం డిపిఆర్‌సి భవన్‌లో ఉద్యోగ విరమణ పొందిన జిల్లా పంచాయతీ అధి కారి ఆశాలత అభినందన సన్మానోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ అను దీప్ దురిశెట్టి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి డిపివో దంపతులు ఆశాలత, కమల్ రాజ్ లను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పూలమాలలు, శాలువతో ఘనం గా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ప్రభుత్వ విధానాలను క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో ఆశాలత చూపిన నిబద్ధత, క్రమశిక్షణ ఇతర అధికారులకు ఆదర్శప్రాయమన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పంచాయతీల బలోపేతం, ప్రజలకు మెరుగైన సేవలతో ఆమె చేసిన కృషి ప్రశంసనీయ మన్నారు. అంకితభావంతో పనిచేస్తూ శాఖకు మంచి పేరు తీసుకు వచ్చారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆశాలత కుటుంబ సభ్యు లతో కలిసి ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఆనందభరితమైన భావి జీవితాన్ని గడపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సిపివో శ్రీనివాస్, హౌజింగ్ పిడి బి. శ్రీనివాస్, వెంకటపతిరాజు, రాజేం ద్రప్రసాద్, డిఎల్‌పివో రాంబాబు, విజయలక్ష్మి, ఎంపిడివోలు, పంచా యతీరాజ్ శాఖాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు యూరియా పంపిణీ

**రైతులు ఆందోళన చెందవద్దు**

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం దాచాపురం, సిరిపురం, అష్ణగుర్తి, తాటిపూడి గ్రామాల్లో యూరియా పంపిణీ చేయడం జరిగింది. పంపిణీ కార్యక్రమం ఉదయం 6గంటల నుండి ఏఈవోలు ముందస్తుగా గ్రామాల్లో యూరియా కూపన్‌లు రైతులకి డిస్ట్రిబ్యూట్ చేయడం జరి గింది. తదనంతరం వెంటనే రైతులు సొసైటీలో యూరియా తీసుకో వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి, వైరా మండల తహశీల్దార్ సిహెచ్.సురేష్, ఎంపిడివో బి.సపక్రియ, వైరా సబ్ ఇన్స్‌పెక్టర్‌లు పుప్పాల రామారావు, పవన్‌లు పర్యవేక్షించారు. ఈ రోజున కూపన్‌లు ద్వారా మండలంలో 1740 యూరియా బాగ్స్ ఎటు వంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డిస్ట్రిబ్యూట్ చేయడం జరి గిందని మండల వ్యయసాయ అధికారి తెలియజేశారు. సరిపడనంత ఉందని రైతులు కృత్రిమ కొరతను దయచేసి సృష్టించవద్దని మండల



వ్యవసాయ అధికారి కోరడం జరిగింది. అవసరమైన రైతులు మాత్రమే యూరియా తీసుకోవాల్సిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సైదులు, వాసంతి, రాజేష్, కీర్తి, పంచాయతీ సెక్రటరీలు గ్రామ పాలన అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నూతన సం.ను పురస్కరించుకుని కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు, జిల్లా ప్రజలకు హృదయ పూర్వక నూతన సం. శుభా కాంక్షలు తెలిపారు. ఈ నూతన ఏడాది ప్రతీ కుటుంబానికి శాంతి, సుఖ సంతోషాలు ఆరోగ్య తీసుకురావాలని ఆకాంక్షించారు. గత సం.లో ప్రజ సహకా రంతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతంగా చేయ నున్నట్లు తెలిపారు. ప్రజల సమస్య పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమ ని అన్నారు. కార్మికులు, రైతులు, యువత, మహిళలు, అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ముం దుకు సాగుతున్నట్లు తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో మరింత పురోగతి సాధించేం దుకు కృషి చేస్తామని తెలిపారు. పేదల, జీవితాల్లో మార్పు తీసుకురావడమే ధ్యేయం అన్నారు. ప్రజలు ఐఖ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతీ కుటుంబంలో ఆనందం వెల్లివిరి యాలని కోరారు. ప్రజల విశ్వాసానికి తగిన విధంగా సేవలందిస్తామని ఎంఎల్‌ఏ కూనంనేని స్పష్టం చేశారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా జిల్లా ప్రజలకు నూతన సం. శుభా కాంక్షలు తెలిపారు. ఈ కొత్త సం.లో ప్రతీ కుటుంబంలో నూతన శాంతి, ఆనందం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ ఎల్లప్పుడూ ముందు ఉంటుందని పేర్కొన్నారు. కార్మికులు, రైతులు, పేదల హక్కు పరిరక్షణకు పార్టీ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుంద న్నారు. అభివృద్ధి, సంక్షేమం సమతుల్యంగా అమలయ్యేలా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. నూతన సం. శలు, ఆశయా లతో ముందుకు సాదే ఏడాదిగా ఉండాలని కోరారు. ప్రజల మద్దతుతో సిపిఐ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని పాషా స్పష్టం చేశారు.

## విద్యా దానం మహాదానం

**-శివకుమారి అభినందన సభలో కూనంనేని**



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** అన్ని దానాల్లో కెల్లా విద్యాదానం ఎంతో గొప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనం నేని సాంబశివరావు తెలిపారు. ఏదులాపురం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న బోజడ్ల శివకుమారి ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన అభినం దన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివకుమారిని శాలువతో సత్కరించి అభినంద నలు తెలిపారు. విద్యాశాఖలో 40 ఏళ్ల పాటు వివిధ హోదాలలో పనిచేసి హెచ్‌ఎంగా ఉద్యోగ విరమణ పొందుతున్న శివకుమారి సేవలు మరువలేనివన్నారు. ఆమె ఉద్యోగ విధులు నిర్వహిం చిన ప్రతిచోట పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేశార న్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న ఆమె భావి జీవితం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యా లతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

## రేగులచలకలో కంటి వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని రేగులచలక గ్రామంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎంపిజెటి డిగ్రీ కళాశాల రఘునాథపాలెం, ఖమ్మం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రేగులచ లక గ్రామంలో నిర్వహిస్తున్న శీతాకాల ప్రత్యేక శిబిరం బుధవారం ఐదవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామ పంచా యతీ కార్యాలయంలో కంటి వైద్య నిపుణులు ఎ. రాంబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులకు, విద్యా ర్థినీలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యండపల్లి రమాదేవి సత్యం, ఉప సర్పంచ్ నున్నా వెంకటేశ్వర రావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్. స్వాతి, అధ్యాపకులు శ్రీలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

## పుష్పలత సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నాలుగు దశాబ్దాల పాటు ఉపాధ్యాయురాలిగా పనిచేసి ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన పుష్పలత సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పుష్పలత ఉద్యోగ విర మణ సందర్భంగా బుధవారం గొల్ల గూడెం ఉన్నత పాఠశాలలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరే టర్ వలరాజు మాట్లాడుతూ పుష్పలత ఉపాధ్యాయ వృత్తికి అంకితమై పని చేశారన్నారు. పాఠ శాల అభివృద్ధికి సైతం ఆమె చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ఖమ్మం కార్పొరేటర్ బిజి క్లెమెంట్ పుష్పలత దంపతులను, స్థానిక ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆడిటోరియం నిర్మాణానికి ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలి పారు. ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, ఉపాధ్యాయులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.